క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రోత్సాహకాలు

ఐరాల: మండలంలో నూతనంగా మామిడి పంటలను సాగు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యానశాఖ ద్వారా మూడేళ్ల వరకు రాయితీ అందిస్తున్నట్లు మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి పంటలకు పిచికారీ చేసే మెషీన్‌లు, తైవాన్ స్ప్రేలు, కలుపు తీసే మెషీన్లు కొనుగోలు చేసి ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీ అందిస్తామన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా హనుమాన్ జయంతి


అలంకరణలో వీరాంజనేయస్వామి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం పొన్నియమ్మ ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. మూలస్థానంలోని స్వామి వారిని వివిధ రకాల పుష్పాలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు తగ్గువారిపల్లెలో ఆరోగ్య సురక్ష-2

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. ఉదయం వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీల పరిశీలన


కాలనీలోని ఇళ్ల రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర అబ్జర్వర్ కరీముల్లా

తవణంపల్లె: మండలంలోని జగనన్న కాలనీల్లో నిర్మించిన పక్కా గృహాలను, వివిధ దశల్లో పనులు జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను గురువారం వాప్కోస్ థర్డ్‌పార్టీ అబ్జర్వర్ ఎస్.కె. కరీముల్లా, హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం, ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించారు. కేంద్రం నిధులు ఏపీ ఇంటికి ఎంత నిధులు మంజూరు చేశారని క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడి ఆరా తీశారు. బిల్లులు సక్రమంగా అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. పూర్తి కాని పనులను వెంటనే పూర్తి చేయించాలని అబ్జర్వర్ కరీముల్లా అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన డైరీని డీఈవో విజయేంద్రరావు ఆవిష్కరించారు. డీఈఓ కార్యాలయంలో గురువారం ఆ సంఘం నాయకులు డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డైరీని పరిశీలించిన డీఈఓ టీచర్లకు ఉపయోగపడే పలు అంశాలు డైరీలో ఉన్నాయన్నారు. డైరీ చాలా ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు యువరాజులురెడ్డి, ప్రధాన కార్యదర్శి జైకాంత్, నాయకులు సోమచంద్రారెడ్డి, కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నాడు-నేడులో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. ఆ కళాశాలలో గురువారం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకంలో సర్కారు బడులు, కళాశాల రూపురేఖలు పూర్తిగా మార్చిందని తెలిపారు. రూ.78 లక్షలతో పీసీఆర్ ఒకేషనల్ కళాశాలలో నాడు-నేడు పనులు చేపట్టినట్లు వివరించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మేయ ర్ అముద, ప్రిన్సిపల్ జయప్రకాష్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ రెడ్డెప్ప

బంగారుపాళెం: కబడ్డీ పోటీల్లో తలపడుతున్న జట్లు


బంగారుపాళెం: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు


హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా

బంగారుపాళెం: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా గురువారం రెండో రోజు మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తగ్గువారిపల్లె, నలగాంపల్లె గ్రామాల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. 27 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 98 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. తగ్గువారిపల్లె క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలను ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. స్థానిక ఎంపీటీసీ హేమచంద్ర, జిల్లా ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి రఘుపతిరాజు, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదాయత్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందు కోసమే ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.


బంగారుపాళెం: క్రికెట్ పోటీల్లో తలపడుతున్న జట్లు

గొల్లపల్లె పంచాయతీ గెలుపు

యాదమరి: మండల స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో 184 గొల్లపల్లె యువకులు గెలుపొందారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన క్రీడాపోటీల్లో కబడ్డీ పోటీలు నిర్వహించగా ఫైనల్‌లో నూరే నగర్ జట్టుపై 184 గొల్లపల్లె పంచాయతీ యువకులు విజేతగా నిలిచారు. వారిని 184 గొల్లపల్లె సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, పీటీ చిట్టిబాబు తదితరులు అభినందించారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం కబడ్డీ క్రీడాపోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీల్లో భాగంగా అధికారులు గురువారం కబడ్డీ పోటీలను నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి ప్రారంభించారు. మహిళల కబడ్డీ పోటీల్లో పి.కొత్తకోట జట్టు మొదటి స్థానంలో, పాలకూరు(వడ్డేపల్లి) రెండో స్థానంలో, పేటాగ్రహారం మూడవ స్థానంలో నిలిచాయి. పురుషుల కబడ్డీ పోటీల్లో విజేతగా వేపనపల్లి, రెండో స్థానంలో బైటపల్లి, మూడవ స్థానంలో యం.బండపల్లి జట్లు నిలిచాయి. విజేతలు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని ఎంపీడీఓ గౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జాన్‌విక్టర్, వైస్ ఎంపీపీ ద్వారకనాతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సర్పంచ్ మాసిలామణి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మణి, షణ్ముగం, పద్మజారాణి, నవీన్‌రెడ్డి, బాలాజీ, నాగరాజ, రామమూర్తి, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేత పైమాఘం


బ్యాడ్మింటన్ విజేత జట్టుకు కిట్టును అందజేస్తున్న అధికారులు

తవణంపల్లె: మండలంలోని అరగొండ, తొడతర, టోటల్ హెల్త్‌లో ఆడుదాం ఆంధ్రాలో క్రీడాపోటీలు నిర్వహించారు. సెమిఫైనల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని పోటీపడ్డారు. అరగొండ బాలుర హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పైమాఘం సచివాలయ జట్టు ఆటగాళ్లు మురుగ, అజయ్ విజేతలుగా నిలిచారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి.


అరగొండలో పోటాపోటీగా వాలీబాల్ పోటీలు


యాదమరి: విజేత జట్టుతో సచివాలయ సిబ్బంది, పీటీ మాస్టర్లు


బంగారుపాళెం: బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు


పూతలపట్టు: కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తలపులపల్లె బాబురెడ్డి, అధికారులు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఐరాల: మామిడిలో మొగ్గలు త్వరగా రావడానికి, పూత పిందె దశలో చీడ పీడల నుంచి కాపాడుకోవడానికి మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని పాలకల రైతు భరోసా కేంద్రంలో గురువారం మామిడి రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మామిడిలో ప్రధాన సమస్యలైనా తేనె మంచు, తామర, పండు ఈగ పురుగుల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మామిడిలో అంత్రాక్నోస్, బూడిద తెగుల నివారణకు, యాజమాన్య పద్ధతులు, మామిడి తోటల్లో విడతల వారీగా పిచికారీ చేయవలసిన మందులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత టెరిన్‌రెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి సాగరిక, ఉద్యాన సహాయకులు రామచైతన్య, మురళీకృష్ణ, కావేరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

నేడు మెగా రక్తదాన శిబిరం

నగరి : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీవో సుజన అన్నారు. రక్తదాన శిబిర నిర్వహణ అంశాలపై చర్చించే నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం ఉత్తమ దానమన్నారు. రక్తదానం ఒక మనిషి జీవితాన్ని కాపాడుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన రైలు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారన్నారు. అలాంటి సమయంలో యువకులు నిర్ణయం తీసుకోకుంటే మృతుల సంఖ్య పెరిగేదన్నారు. ఈ అంశాన్ని గ్రహించి రక్తదానం చేసేందుకు యువకులు ముందుకురావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైద్య అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది హాజరు అయ్యారు.

106/2 జీవోను రద్దు చేయాలి

యాదమరి: కేంద్ర ప్రభుత్వ వాహనాలు ప్రమాదాలపై తీసుకొస్తున్న జీఓ 106/2 జీవోను రద్దు చేయాలని మండల కేంద్రంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లారీ యూనియన్ డ్రైవర్లు, క్లీనర్‌లు, జిల్లా సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. చిత్తూరు గుడియాత్తం జాతీయ రహదారిపై గురువారం ఉదయం నిరసన తెలిపారు. అనంతరం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 106/2 జీఓ ప్రకారం రహదారుల్లో ప్రమాదం జరిగితే పెద్ద వాహనదారులతో ఎలాంటి తప్పుల్లేకపోయిన డ్రైవర్, క్లీనర్లు అక్కడ ఉండాలని, ప్రమాదంలో గాయపడిన వారికి అన్ని సదుపాయాలు కల్పించి ఆస్పత్రుల్లో చేర్పించాలని సూచించారన్నారు. లేకపోతే అపరాధం, జైలుశిక్ష వేయనున్నట్లు జీవోను తీసుక రావడం చాలా దారుణమన్నారు. పెద్ద వాహనదారులు చాలా వరకు తమంతట తాము డ్రైవింగ్ చేసుకొని వెళ్తున్న చాలా మంది ద్విచక్ర వాహనదారులు వారే వచ్చే ప్రమాదాలు చేస్తున్నారని వాపోయారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం జీవోను తీసుకొస్తే దేశ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేయనున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చైతన్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ యూనియన్ నాయకులు అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్యం



ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, గుడిపాల: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

189 కొత్తపల్లెలో ..

గుడిపాల: మండలంలోని 189కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ చంద్రమహేష్ 76 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంచానికి గురైన రోగుల ఇంటికే వెళ్లి వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది చంద్ర, సునీత,అనీత, ఎలవర్తి పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఆర్టీసీ చైర్మన్


వినాయకుని సేవలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్‌తో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి దర్శించుకున్నారు. ఆయన గురువారం సాయంత్రం స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

కళాశాలలో ముందే వచ్చిన సంక్రాంతి


సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినుల సందడి

పుత్తూరు:పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులతో కళాశాల ఆవరణ కోలాహలంగా మారింది. మామిడి తోరణాలు, అరటి చెట్లు, చెరకు గడలు, పూలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నింపారు. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి, అందులో గొబ్బెమ్మలు పెట్టి, లయబద్ధంగా గొబ్బి నృత్యం చేశారు. అనంతరం భోగి మంట వేసి, కలశ పూజతో సంక్రాంతి పండుగను ఆవిష్కరింప చేశారు. అనంతరం సంబరాలు అంబరాన్ని అంటాయి. ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తెలుగువారు ఎంతో ఇష్టంగా జరుపుకొనే తొలి పెద్ద పండుగ సంక్రాంతి అని తెలిపారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు కనుక మకర సంక్రాంతిగా పిలుస్తారని వివరించారు. భోగి, సంక్రాంతి, కనుమ పేర్లతో మూడు రోజుల పాటు తెలుగు లోగిళ్లు పండుగ వాతావరణంతో తొనికసలాడుతుందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి, కళాశాల సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు వి.వీరయ్య, టి.నరసింహులు, వాణిశ్రీ, శ్రీదేవి, హరిబాబు, దేవకి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు గర్భాశయ క్యాన్సర్ ముప్పు

- పెరుగుతున్న కేసులు
- నియోజకవర్గంలో 7 వేల మంది బాధితులు
- నెలలు నిండకముందే ప్రసవాలు కారణం
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స


చిత్తూరు ఆస్పత్రిలో సేవలందిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్: మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ముందు వరుసలో ఉంటుంది. ఇందులో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఒకటి. ప్రారంభంలో ఈ వ్యాధికి సంబంధించి పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ లోలోపల అది చాపకింద నీరులా పాకిపోయి చివరికి ప్రాణాలు తీస్తుంది. దురదృష్టవశాత్తూ చాలా మంది మహిళలు సరైన అవగాహన లేక, సకాలంలో గుర్తించక ఈ వ్యాధి బారిన పడుతున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జనవరి మాసాన్ని గర్భాశయ ముఖ ద్వార అవగాహన మాసంగా నిర్వహిస్తుంది.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో సెర్వికల్ క్యాన్సర్ అంటారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో నాలుగో అత్యంత సాధారణ క్యాన్సర్. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిగణిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉండే క్యాన్సర్ వైద్యుల వద్దకు ప్రతి రోజూ 20 నుంచి 30 మంది కొత్తగా క్యాన్సర్‌గా బాధితులు వస్తున్నారు. ప్రతిరోజూ 15 నుంచి 10 మందికి కీమోథెరపీ, 20 మందికి రేడియో థెరపీ చేస్తున్నారు. నిత్యం 100 నుంచి 150 మంది ఇన్‌పేషంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో 20 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులున్నారు.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా క్యాన్సర్ చికిత్స

క్యాన్సర్ వ్యాధులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించేందుకు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. ఈ పథకం లేనప్పుడు రోగులకు లక్షల రూపాయలు ఖర్చయ్యేది. అన్ని ఆస్పత్రుల్లో క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులకు ఆసరా పథకం కింద రోజుకు రూ.225, నెలకు రూ.5 వేలు తక్కువ కాకుండా ప్రభుత్వం అందజేస్తోంది.

ఎందుకు వస్తుందంటే...

ఈ క్యాన్సర్ ప్రధానంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) అనే వైరస్ కారణంగా వస్తుంది. దీంతో పాటు తక్కువ వయసులో వివాహం చేయడం, ఎక్కువగా లైంగిక సంబంధాలు కొనసాగించడం, స్త్రీ, పురుషులిద్దరిలో బహుళ లైంగిక భాగస్వాములుగా ఉండడం, ముందస్తు ప్రసవాలు, ఎక్కువ మంది పిల్లలను కనడం, ధూమపానం, మద్యపానం ఆల వాట్లు ఈ క్యాన్సర్ రావడానికి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. ఇది ప్రధానంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసుగల స్త్రీలను ప్రభావితం చేస్తుంది.

ఇలా చేస్తే నివారణ సాధ్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2020లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికను అందించింది. దీనికింద 2030 నాటికి 90 శాతం కౌమార బాలికలకు 15 ఏళ్ల వయసులోపు హెచ్‌పీవీ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయాలి. 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన 70శాతం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. గర్భాశయ పూర్వ క్యాన్సర్ లేదా క్యాన్సర్‌తో బాధపడుతున్న 90 శాతం మహిళలకు తగిన చికిత్స అందించాలి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి మాసాన్ని సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసంగా హైలెట్ చేయాలి.

వ్యాధి లక్షణాలు

- సాధారణ రుతుక్రమం కాకుండా యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం (మెనోపాజ్)
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మలవిసర్జనలో ఆటంకాలు

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట

సాధారణంగా వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుంది. దీనివల్ల వివాహం అయిన మహిళలు ప్రతి సంవత్సరం పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకుంటే, క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించగలిగితే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకోవచ్చు. దీనికితోడు కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి 70 నుంచి 80 శాతం వరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. – ఉషశ్రీ, గైనకాలజిస్ట్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



నూతన చర్చికి భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో నూతనంగా నిర్మించనున్న చర్చికి గురువారం ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తొలిసారిగా చర్చికి సంబంధించి భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జనార్దన్, మండల వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రాయల్, మధుసూదన్ రెడ్డి, గోల్ల హరిప్రసాద్, కుమార్, రమేష్, చిట్టిబాబు, సంపూర్ణ, మోహన్, విజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

14న గోదారంగనాథుల కల్యాణం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 14వ తేదీన గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందన్నారు. ప్రత్యేకంగా తమిళనాడులోని శ్రీవల్లి పుత్తూరు దేవస్థానం తరపు మాల సమర్పణ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.